హైదరాబాద్ వార్త



# ఇం'ధనం' ఒక్కటే ధ్యేయం

# సేవలు శూన్యం

పెట్రోల్ బంకులో కేవలం పెట్రోల్, డీజిల్ మాత్రమే కాదు.. వినియోగదారులకు చాలా సేవలు బంకు యాజమాన్యాలు కల్పించాలి. వాటిపై వినియోగదారులకు ఎలాంటి అవగాహన లేకపోవడముతో బంకు యజమానులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** పెట్రోల్ బంకుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆయా బంకుల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కేవలం పెట్రోల్, డీజిల్ మాత్రమే కాదు.. వినియోగదారులకు చాలా సేవలు బంకు యాజమాన్యాలు కల్పించాలి. వాటిపై వినియోగదారులకు ఎలాంటి అవగాహన లేకపోవడముతో బంకు యజమానులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంలోని ఎల్బీనగర్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న పెట్రోల్ బంకుకు నిత్యం వంద లాది వాహనాలు వస్తాయి. ఇక్కడ పెట్రోల్, డీజిల్ పోయించుకోవాలంటే హెచ్చుతగ్గుల్ని ఎక్కడా డిస్‌ప్లే చేయడం లేదు. వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని పెట్రోల్ బంకుల్లో తాగునీటి సౌకర్యం లేకపోవడమే కాకుండా వాహనాలకు గాలి నింపి డబ్బులు వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల గాలి నింపే యంత్రాలు పనిచేయడం లేదు. ఉచితమని బోర్డులకు మాత్రమే పరిమితం. డెన్సిటీ మీటర్లు, ఫిల్టర్ సెట్టింగ్, కల్తీ పరిశీలించేందుకు టెంపరేచర్ రికార్డర్స్ అందుబాటులో లేవు. సిబ్బందికి మాత్రమే మరుగుదొడ్లు అందుబాటులో ఉంచి బంక్‌ల యాజమాన్యాలు వాహనదారుల మౌలిక అవసరాలను గాలి కొదిలారు. హయత్‌నగర్

- ◆పెట్రోల్ బంకుల్లో కనిపించని మౌలిక వసతులు
- ◆మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు
- ◆అరకొరగా గాలి పరికరాలు
- ◆గాలి పెట్టటానికీ డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బంది
- ◆ధరల డిస్‌ప్లే బోర్డులు నిల్
- ◆అందుబాటులో లేని నాణ్యత పరీక్ష కిట్లు, ఫిర్యాదు బాక్సులు
- ◆పౌరసరఫరాల శాఖ బంకుల్లోనూ పరిస్థితి ఇంతే..



కనీసం 15 నిమిషాలు వేచి ఉండాల్సిందే. ఇక్కడ వాహనదారులు తాగేందుకు నీళ్లుండవు. వాహనానికి గాలి పెట్టుకోవడానికి ఎయిర్‌పంపు ఉండదు. సాక్షాత్తూ ప్రభుత్వ నిర్వహణలో ఉన్న పౌరసరఫరాలశాఖే ఈ బంకు నడుపుతుంది. నగరంలో బంకుల నిర్వహణ తీరు తెన్నులపై తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాలశాఖ తాను నిర్వహిస్తున్న బంకులోనే నిబంధనలకు నీళ్లు వదలటం విడ్డూరం. ఈ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నగరంలోని ఇతర బంకుల్లోనూ ఇదే పరిస్థితి. ఇక ఇతర ప్రైవేట్ బంకుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. పెట్రోల్, డీజిల్ అమ్మకాలపైనే దృష్టి సారించిన నిర్వాహకులు వాహనాదారులకు ఎలాంటి సౌకర్యాలు అందించడం లేదు. గ్రేటర్ హైదరాబాద్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో కలిపి 560కిపైగా పెట్రోల్ బంకులు ఉండగా వాటిలో నిత్యం వేల లీటర్ల పెట్రోల్, డీజిల్ అమ్ముడుపోతుంది.

**బంకుల్లో ధరల డిస్‌ప్లే లేదు...**

వనస్థలిపురం విజయవాడ రహదారి, హస్తినాపురం సాగర్ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన పలు పెట్రోల్ కంపెనీలకు చెందిన పంపులు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. పెట్రోల్, డీజిల్ విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న పలుపెట్రోల్ బంకుల్లో టాయిలెట్స్ ఉన్నప్పటికీ అవి అపరిశుభ్రంగా ఉన్నాయి.

**కనింపించని కొలమానాలు..**

పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానం ఉంటే అక్కడే తనిఖీ చేసుకోవచ్చు. ఫిల్టర్ పేపర్‌పై ఒక్కచుక్క ఇందనం వేస్తే పదిసెకన్లలో ఆవిరైపోతుంది. ఆరిన తర్వాత కనిపిస్తే కల్తీ జరిగినట్లు గ్రహించాలి. హైడ్రోమీటర్ల ద్వారా కూడా నాణ్యతను తెలుసుకోవచ్చు. ఇందుకు బంకుల్లో హైడ్రోమీటర్, ఫిల్టర్ పేపర్ ఐదులీటర్ల క్యాన్ అందుబాటులో ఉంచాలి. అయితే ఏ ఒక్క బంకులోనూ ఇంధన నాణ్యత పరిశీలిచే కిట్ అందుబాటులో ఉండదు.

**ఫిర్యాదు నెంబర్లు ఇవీ**

బంకుల్లో సరదుపాయాలు సరిగా లేకపోయినా బంకు సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా వినియోగ దారులు ఫిర్యాదు చేయవచ్చు. చిరునామాతో, ఇతర సమాచారం ఇస్తే.. సంబంధిత చమురు సంస్థ వారిపై చర్యలు తీసుకుంటంది. ఫిర్యాదు చేయవలసిన టోల్ ఫ్రీ నెంబర్లు.. ఇండియన్ ఆయిల్: 1800233355, భారత్ పెట్రోలియం: 1800224344, హెచ్పీసీఎల్: 18002333555, రిలయన్స్: 18008919023.

# ముంచేసిన వాన

వర్షం బీభత్సంతో జనజీవనం అతలాకుతలం

వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు

స్తంభించిపోయిన ట్రాఫిక్

మరో ఐదు రోజులు కుమ్ముడే

వాతావరణశాఖ వెల్లడి

అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని జిహెచ్‌ఎంసి అధికారులు హెచ్చరిక

**ఖాజాగూడ సర్కిల్‌లో పిడుగుపాటు ప్రాణభయంతో జనం పరుగులు**

**గంట వ్యవధిలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు**





భారీ వర్షానికి జలదిగ్బంధమైన ప్రధాన రహదారులు



**హైదరాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** గత మూడు రోజుల నుంచి సూర్యుడు ప్రజలకు కాస్త ఉపశమనాన్ని ఇవ్వటంతో తేరుకున్న భాగ్యనగరాన్ని సోమవారం వరుణ దేవుడు మళ్లీ ముంచేశాడు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వాతావరణం మారి ఒక్కసారిగా భారీ వర్షం పడింది. కేవలం గంట పాటు కురిసిన వర్షానికి రోడ్లు అన్నీ జలమయ్యం అయ్యాయి. నదులను తలపించేలా లోతట్టు ప్రాంతాలు మారాయి. క్యూమిలోనింబస్ కారణంగా తక్కువ సమయంలోనే కుండపోత వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది. తక్కువ ఎత్తులోని ప్రాంతాలు నీటమునిగాయి. సికింద్రాబాద్, ప్యారడైజ్, మారెడ్‌పల్లి, తార్నాక, నాచారం, ప్రధాన రహదారులు చెరువులుగా మారాయి. సరిగ్గా ఆఫీసుల నుంచి ఉద్యోగస్తులు,

మిగతా 3లో



యూసుఫ్‌గూడలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామి

## మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

**మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామి**

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 4, ప్రభాతవార్త :** కాంగ్రెష్ ప్రజా పాలనలో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని ప్రజా అభివృద్దే కాంగ్రెస్ ధ్యేయమని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో షేక్‌పేట్, యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని ఇంజినీరింగ్ కాలనీ, ఎల్లారెడ్డిగూడ, అంబేద్కర్‌నగర్ ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, నగర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్నన్‌లతో కలిసి పలు మౌలిక వసతుల పనులకు శంకుస్థాపనలు చేశారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సన్న బియ్యం పంపిణీ, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయటం జరిగిందని గుర్తు చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో జూబ్లీహిల్స్ అభివృద్ధిలో వెనుకబడిందని కాంగ్రెష్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలోనే ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు అజారుద్దీన్, నవీన్ యాదవ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నివాస ప్రాంతాలకు పార్కులే ప్రాణం

**లేఔట్‌ల ప్రకారం కాపాడుతాం - హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** లే ఔట్‌నే ప్రామాణికంగా తీసుకుని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షి స్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ ఫిర్యా దులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులను ఎక్కడా బ్లాక్ చేయవద్దని.. పార్కుల ఆవశ్యకతను అర్థం చేసు కుని వాటిని వదలిపెట్టాలన్నారు. ఎక్కడ ఆక్రమణ జరిగినా, ఉల్లంఘనలైనా నేరుగా హైడ్రాకు ఫిర్యాదు చేయాలన్నారు. హైడ్రా ప్రజావాణికి 58 ఫిర్యా దుల రాగా ఇందులో అధికభాగం పార్కుల కబ్జాలు, రహదారుల ఆక్రమ ణలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కాజేసే ప్రయత్నాలపై ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి. ఈ ఫిర్యాదులను కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్, లేఔట్లతో పాటు.. ఎన్‌ఆర్ ఎస్‌సీ, సర్వే ఆఫ్ ఇండియా, గ్రామ రికార్డులను ఫిర్యాదుదారుల ముందే ఆన్‌లైన్లో చూసి.. పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఆదేశించారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కమిషనర్ ఎ.వి.రంగనాథ్

అక్కడికక్కడే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించాలని అసెట్ ప్రొటెక్షన్ అధికారులకు అప్పగించారు. సమస్య పరిష్కారానికి గడువును కూడా ఫిర్యాదుదారుల ముందే నిర్ణయించారు.

**ఫిర్యాదులు ఇలా..**

సికింద్రాబాద్‌లోని బోయిగూడ సమీపంలో సికింద్రాబాద్ మున్సిపాలిటీ ఉన్న సమయంలో కురుమ శ్మశానవాటిక కోసం ప్రత్యేకంగా 2 వేల గజాల స్థలాన్ని కేటాయించగా.. నేడు అది నామ రూపాలు లేకుండా కబ్జాలకు గురైందని కురుమ సంఘం ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం,

మిగతా 3లో

## ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సూత్రదారి మండలి

**-హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**
**-గానసభలో మండలి వెంకట కృష్ణ రావు శతజయంతి మహోత్సవాలు ప్రారంభం**

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** ప్రముఖ గాంధేయవాది, రాజనీతిజ్ఞుడు, సామాజిక సేవకుడు సుపరిచితులు మండలి వెంకట కృష్ణా రావు అని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో కిన్నెరా ఆర్ట్స్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి మద్దాలి రఘురాం ఆధ్వర్యం ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సూత్రధారి మండలి వెంకట కృష్ణ రావు శతజయంతి మహోత్సవాల ప్రారంభోత్సవ సభ ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణ అభివృద్ధికి అపారమైన కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. దివిసీమ గాంధీగా మండలి వెంకట కృష్ణా రావు మన్ననలనందుకున్నారని అన్నారు. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ మాట్లాడుతూ బాధలలో ఉన్న వారిని మనమే ముందు వెళ్లి ఓదార్చాలని, ఆయన ఆచరించి చెప్పిన మాటలు దివిసీమ ప్రజలకు భగవద్గీతలా





కార్యక్రమంలో పాల్గొన్న హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చిత్రంలో ఓలేటి పార్వతీశం, ఉదయ్‌భాస్కర్ తదితరులు

వినిపిస్తూనే ఉంటాయని అన్నారు. కృష్ణారావు కృషి వల్లే దివిసీమలోని నిరుపేదలకు బంజరు భూములను పంచే కార్యక్రమం ప్రారంభమైందని, . 15 వేల ఎకరాల బంజరు భూములను ఆనాడు పేదలకు పంచారని అన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిధిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బాషా సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకులు డాక్టర్ డి.విజయ భాస్కర్, నిర్వాహకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మా తెలుగుతల్లికి మల్లెపూదండ పేరుతో నృత్యకిన్నెర నిర్వహణలో కూచిపూడి నృత్య రూపక కార్యక్రమం కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ మందలి ఉషా గాయత్రీ దర్శకత్వంలో జరిగింది.

## నృత్యకళలు మన సంస్కృతిని పెంపొందిస్తాయి

**హాస్యబ్రహ్మ శంకరనారాయణ**

**శేరిలింగంపల్లి, అగష్టు 4 ప్రభాతవార్త :** నృత్యకళలు, కర్ణాటక సంగీతంలోని గీతాలు మన కళా సంపదను, భారతీయ సంస్కృతిని, భక్తిని పెంపొందిస్తాయని కళారత్న, హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ అన్నారు. మదీనా గూడలోని శ్రీదర్మపురి క్షేత్రంలోని నాంపల్లి బాబా సంస్థానంలో రమ్యా నాయుడు ఆధ్వర్యంలోని శ్రీరాగరమ్య సంస్థ నిర్వహజంచిన శ్రావణ శృతి లయలు కార్యక్రమానికి శంకర నారా యణ ముఖ్యఅతిధిగా హాజర య్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. కూచిపూడి, భరత నాట్యం వంటి నృత్యాలు, కర్ణాటకా సంగీతం లోని గీతాలు మన కళా సంపదను, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఆరేళ్లుగా శ్రీరాగరమ్య సంస్థ సారధ్యంలో రమ్యానాయుడు 3 వందల సాంస్కృతిక, కళాకార్యక్రమాలను నిర్వహించటం విశేషమన్నారు. అజయ్‌బాబు సారధ్యంలో నాంపల్లి బాబా సంస్థానంలో భక్తి ప్రపత్తులతో చక్కటి క్రమ శిక్షణా వాతా వరణం అలవ రుస్తున్నారన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రలయిన తిరుపతి, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుచానూరు, భద్రాచలంలో వందకు పైగా భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలను రమ్యానాయుడు నిర్వహించటం గొప్పవిషయమని కొనియాడారు. జంటనగరాలతో పాటు ఉభయ రాష్ట్రాలలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు కనువిందైన నృత్యాలతో వీనుల విందయిన పాటలతో ప్రేక్షకులను పరవశింపజేశారన్నారు. భక్తిని, క్రమశిక్షణను మేళవించి కళాకార్యక్రమాలను చేయాలని, అందుకు తాము ఉచితంగా అవకాశమిచ్చి ప్రోత్సహిస్తామని శ్రీ నాంపల్లి బాబా సంస్థానం మేనేజింగ్ ట్రస్టీ తుమ్మల అజయబాబు ప్రకటించారు. నిర్వాహకులు రమ్యానాయుడు ఈ కార్యక్రమాన్ని ఆధ్యంతం అశక్తికరంగా నిర్వహించారు.



శ్రీరాగరమ్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కళాప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న హాస్యబ్రహ్మ శంకరనారాయణ

## శ్రీవారి పవిత్రోత్సవాలకు శ్రీకారం

**సైఫాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి)లోగల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం పవిత్రోత్స వాలకు సంబంధించి అంకురార్పణ కార్యక్రమం ప్రారంభమైంది. తిరుమల నుంచి వచ్చిన వైదిక నిర్వహకులు టి.కృష్ణామాచార్యులు నేతృత్వంలో ఈ అంకురార్పణ కార్యక్రమం అర్చకులు, వేద పండితులు, సన్నాయి మేళాల మధ్య ఘనంగా ప్రారంభమైంది. డోనర్ కె.రామిరెడ్డి ఆధ్వర్యంలో పవిత్రోత్స వాలను పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవాలయంలో రంగుల ముగ్గుల వేశారు. మామిడాకుల తోరణాలు కట్టారు. పూలమాలలతో అందంగా అలంకరించారు. మంగళవారం ఉదయం అగ్ని ప్రతిష్ట, హోమం, పవిత్రోత్స వాలు, పూర్ణహుతి జరుగుతాయని టిటిడి ఎఈవో యు.రమేష్ తెలిపారు. 6వ తేదీన శ్రీవారికి స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ, 7వ తేదీన మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభ సంప్రోక్షణ ఉంటాయన్నారు.

## మీరాలం ట్యాంక్‌లో శిశువు మృతదేహం

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** అత్తా పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అమానవీయ ఘటన వెలుగుచూసింది. మీరాలం ట్యాంక్‌లో నెలలు నిండని శిశువు మృతదేహం కనిపిం చడం కలకలం రేపింది. గమనించిన స్థాని కులు పోలీసులకు సమాచారం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి సమ యంలో మిరాలం ట్యాంక్‌లో నెలలు నిండని శిశువు మృతదేహాన్ని స్థానికులు గమనిం చారు. స్థానికుల సమాచారం మేరకు అత్తాపూర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిం చారు. మృతశిశువుకు నాలుగు నెలల వయ స్సు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.

## ఫిష్‌వెంకట్ కుటుంబానికి నేను ఉన్నా

**బాలివుడ్ నటుడు సోనూసూద్ భరోసా**

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** చలనచిత్రరంగంలో తన నటన ద్వారా అందరి నుంచి ప్రశంసలు అందుకున్న ఫిష్ వెంకట్‌ను కోల్పోవడం బాధాకరం అని బాలీవుడ్ నటుడు సోనూసూద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఇటీవల కిడ్నీసంబంధ వ్యాధితో మృతి చెందిన ఫిష్‌వెంకట్ కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చలనచిత్రరంగంలో తన నటన ద్వారా అందరి నుంచి ప్రశంసలు అందుకున్నాడన్నారు. తెలుగు చలనచిత్రరంగానికి చెందిన ప్రతి ఒక్కరు ఈ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెంకట్ మరణం తనను కలచివేసిందన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వెంకట్

మిగతా 3లో



ఫిష్‌వెంకట్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సోనూసూద్

## కొండెక్కిన కనకాంబరం



**మెహిదీపట్నం, ఆగస్టు 4, ప్రభాతవార్త :** పూలు లేనిదే ఏ పూజ జరగదు. మరి ముఖ్యంగా వరలక్ష్మి వ్రతం అంటే చెప్పనక్కర లేదు. అలాంటి వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో చేయాలంటే భక్తులు పూలు బాగానే కొనాల్సి ఉంటుంది. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఉండడంతో ఇప్పటికే పూల మార్కెట్‌లు పూలతో నిండిపోతుండగా గుడిమల్కాపూర్‌లోని పి. ఇంద్రారెడ్డి పూల మార్కెట్ వరలక్ష్మీ వ్రతం శోభను సంతరించుకుంది. ఇదిలా ఉండగా పూల ధరలు మాత్రం ఔరా అనేలా ఉన్నాయి. ఏ పూలను కొందామనుకున్నా కొండెక్కి కూర్చున్నాయి. దీంతో మూడు, నాలుగు కేజీల పూలు కొందామనుకున్న కొనుగోలుదారులు ఒకటి, రెండు కేజీలతోనే సరిపెట్టుకుంటున్నారు.

**కేజీ రూ.600**
**ఇతర పూల ధరలూ చుక్కల్లోనే..**
**పొరుగు రాష్ట్రాల్లో వర్షం ఎఫెక్ట్**

దీనికి తోడు ఇతర రాష్ట్రాలలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో పూలు దెబ్బతిని రావడం, తక్కువగా వస్తుండడంతో వర్షం ఎఫెక్ట్ పూలపై పడిందనే చెప్పొచ్చు. శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం సీజన్ సందర్భంగా సోమవారం పి. ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌కు 63 వేల 991 కేజీల పూలు మార్కెట్ కు రావడం జరిగిందని మార్కెట్ అధికారులు తెలిపారు.

గుడిమల్కాపూర్ పి. ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పూలు వస్తుంటాయి. తెలంగాణలోని చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, శంషాబాద్, షాద్నగర్, ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాలతో పాటు కర్ణాటక , బెంగళూరు, మహారాష్ట్ర.

**వివిధ రకాల పూల ధరలు కేజీలలో...**

కనకారాలు 400 - 600
గులాబీ 100 - 200
బంతి 40 - 80
చామంతి 160 - 300
లిల్లీ 120 - 250



సెంటు గులాబీ 120 - 200
లోటస్ రూ.10కి ఒకటి
జర్బర 140- 200
డచ్ 150 - 200

**వర్షాల కారణంగా వ్యాపారం బాగాలేదు**
**కే. శ్రీనివాస్ రెడ్డి (పూల కమిషన్ ఏజెంట్)**

ఇతర రాష్ట్రాలలో భారీ వర్షాలు కురిసిన కారణంగా పూలు దెబ్బతిని వస్తున్నాయి. వాటిని కొనుగోలు దారులు కొనాలంటే ఆలోచిస్తున్నారు. దెబ్బతిన్న పూలను

మిగతా 3లో

## అంబటికి ఈటల పరామర్శ

**మూసాపేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ పార్టీ మూసా పేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌ను మల్కాజిగిరి లోక సభ సభ్యులు ఈటల రాజేందర్ ఆదివారం పరామ ర్శించారు. ఇటీవల అంబటికి పితృవియోగం కలిగిన సంగతి తెలిసిందే. భవాని నగర్‌లోని ఆయన నివాసంలో ఎంపీ ఈటల మల్లేష్ ముది రాజ్‌కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబటి కుటుంబ సభ్యులు, వారి బంధువులు పాల్గొన్నారు.

## వైభవంగా అభయ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

**నిజాంపేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి శ్రీ హోమ్స్ కాలనీలో శ్రీ అభయ ఆంజనేయ సహిత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధన రాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్య క్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొ రేటర్లు రవి కిరణ్, ముఖ్య అతిధు లుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిజాం పేట్ మునిసిపల్ కార్పొరేషన్ ఆలయాల అభివృద్ధిలో ఎల్లవేళల ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల మధుసూదన్, సంబశివా రెడ్డి, శ్రీ వరసిద్ధి వినాయక, అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ట్రస్టు చైర్మెన్ ప్రదీప్ తాళ్ళూరి, కమిటీ సభ్యులు సంభాశివా రావు, విజయ్, ఆనంద్, కిరణ్ కుమార్, వెంకటేశ్వర రావు, శేషి, సంతోష్, రామోజీ రావు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న నాయకులు

## వాటర్ బిల్లు కట్టకపోతే నోటీసులు

**బోర్డు డివిజన్5 జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి**

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** మంచినీటి బకాయిలను సకాలంలో చెలించి హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ సెవేరేజ్ బోర్డు ద్వారా తిరిగి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి తోడ్పాటును అందించాలని బోర్డు డివిజన్–5 జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి వినియోగదారులకు సూచించారు. సోమవారం ముషీరాబాద్, అంబం పేట నియోజకవర్గాలకు సంబంధించిన వివిధ సెక్షన్‌లకు చెందిన డీజీఎం, మేనేజర్లతో సమావేశం నిరన్వహించారు. ఏవరైనా సీవరేజి, తాగునీటి ఫిర్యాదులు చేయాల్సి వస్తే సమీపంలో ఉన్న సెక్షన్ కార్యాలయంలో అందిస్తే వెనువెంటనే పరిష్కారం లభించే అవకాశం ఉంటుందన్నారు. మంచినీరు, డ్రైనేజీ, మంచినీటి బిల్లులకు సంబంధించిన బిల్లుల విషయం, మంచినీటి కనేక్షన్స్ తో ఇతర సమస్యలపై ప్రజావాణి లో ఇచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని అన్నారు. మంచినీటి బిల్లులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందని అన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

## పుట్‌పాత్‌ల కబ్జాలు తొలగించాలి: లక్ష్మన్‌రావుగుప్త

**బేగంబజార్, ఆగస్టు 4ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలోని పుట్‌పాత్‌లను కబ్జా చేసుకుని వ్యాపారులను కొనసాగిస్తున్న దుకాణాలను తొలగించాలని కోరుతూ గోషామహల్ సర్కిల్ 14 డిప్యూటి కమిషనర్ ఉమాప్రకాష్‌కు యాంటి కర్ప్షన్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త వినతి పత్రం అందచేశారు. గన్‌ఫౌండ్రి, బేగంబజార్, జాంబాగ్, గోషామహల్ డివిజన్ల పరుధిలో పుట్‌పాత్‌లను కబ్జా చేసుకుని ఏకంగా కుర్చీలు, డబ్బాలను పెట్టి అమ్మకాలు చేస్తున్నట్లు డి.సికి విన్నవించినట్లు తెలిపారు. హన్‌మాన్‌టేకిడి, ట్రూప్‌బజార్, కోఠి, సుల్తాన్‌బజార్, జాంబాగ్, ఎం.జె మార్కెట్ తదితర ప్రాంతాలల్లో తినుబండారాలను అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇష్టానుసారంగా వాహనాలను పెట్టడం మూలంగా తరుచుగా ట్రాఫిక్ జాం కలుగుతుందన్నారు. జిహెచ్ఎంసి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని పుట్‌పాత్ కబ్జాలను తొలగించాలన్నారు. లేనిపక్షంలో జిహెచ్ఎంసి కమీషనర్ కర్ణన్ కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

## వరద ముంపు నివారణకు చర్యలు తీసుకుంటాం

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** వరదనీటి ప్రవాహానికి రైల్ నిలయం అంబేద్కర్ నగర్ ముంపునకు గురికాకుండా సహాయక చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సోమవారం ఆయన రైల్ నిలయం అంబేద్కర్ నగర్ ఈస్ట్ మారేడ్‌పల్లి టీచర్స్ కాలనీల ప్రాంతాల్లో వరద నీరు సాఫీగా పోయేందుకు రూ.32 లక్షల వ్యయంతో చేపట్టన్ను అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షిం చారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ సంవత్సరాల తరబడి వరదనీటి ప్రవాహానికి గత ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో సమస్యలు జటిలంగా ఉన్నాయన్నారు. వరదనీటి ప్రవాహానికి బస్తీలు ముంపునకు గురి కాకుండా శాశ్వత మరమ్మత్తులు చేపట్టేందుకు రూ.32 లక్షల వ్యయంతో వరదనీటి పైప్‌లైన్ నిర్మాణం పనులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, నాగేశ్ యాదవ్, పి.నర్సింగ్, పూజారి సాంబయ్య, రాపర్తి శివ తదితరులు పాల్గొన్నారు.



వరదనీటి పైప్‌లైన్ పనులను పారంభించటానికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీగణేష్

## రూ. 8.5 లక్షల స్కాలర్‌షిప్‌ల పంపిణీ

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 4 ప్రభాతవార్త :** వాసవి విద్యా ట్రస్ట్ ప్రతియేటా చేపడుతున్న విద్యా ప్రోత్సాహ కార్యక్రమం కింద ఈ ఏడాది 37 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు మొత్తం రూ. 8.5 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ దుబ్బా అనిల్, చైర్మన్ కోత మాను మురళీధర్, అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, ఖజాంచి మాచి కాంతి వెంకట్రమణ పాల్గొని చెక్కులను విద్యార్థులకు అందజేశారు. విద్యారంగ అభివృద్ధికి, విభిన్న నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ట్రస్ట్ కట్టుబడి ఉందని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ట్రస్టీ సభ్యులు

## కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి



6వ వార్డు చంద్రగిరి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారభిస్తున్న బోర్డు మెంబర్ బానుక నర్మద తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. 6వ వార్డు చంద్రగిరి కాలనీ, ఫేజ్ –1లో రూ.15 లక్షలవ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్మధ మాట్లాడుతూ ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తన సొంత వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బాణాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రతీక్ జైన్, కాలనీ ప్రతినిధులు గోపాల క్రిష్ణ, శివకుమార్, మూర్తి, రమేశ్, ప్రసాద్, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగునా అగచాట్లే

### వర్షంతో బేగంపేటలో భారీగా నిల్చిన నీరు - రాకపోకలకు తీవ్ర అంతరాయం

**బేగంపేట ఆగస్టు 4, ప్రభాతవార్త :** నగరంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి బేగంపేట లోని పలు బస్తీల్లో భారీగా వర్షం నీరు నిల్చిపోయింది. భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఒక్క సారిగా ప్రధాన రోడ్డుపైన ప్రయాణిస్తున్న వాహన దారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపివేసారు. దీంతో ట్రాఫిక్ జాం అయింది. బేగంపేట పరిధిలోని కూకట్‌పల్లి నాలా పరివాహక బస్తీలైన బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ, చికోటి గార్డెన్, శ్యాంలాల్ బిల్డింగ్, ప్రకాశంనగర్ ఎక్స్‌టెన్షన్ , మాతాజీనగర్ తదితర బస్తీల్లో భారీగా వర్షం నీరు నిల్చింది. శ్యాంలాల్ బిల్డింగ్ గణేష్ ఆలయం జంక్షన్‌లో భారీ ఎత్తున నీరు నిల్చిపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇక్కడ భారీ ఎత్తున వర్షం నీరు నిల్చిపోవడంతో కొన్ని ద్విచక్రవాహనాలు వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. ఒక వైపు కూకట్‌పల్లి నాలాలోనీటి ఉదృతి పెరగడంతో నాలాలోని డ్రైనేజీ పైపులైన్ల ద్వారా పరివాహక బస్తీల్లోకి నీరు రిటన్ వచ్చి నిల్చింది. శ్యాంలాల్ బిల్డింగ్ లో కొచ్చర్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న నాలా కు ఉన్న నాలుగు నీరు పోయే మార్గాల్లో రెండు పూర్తిగా పూడికతో నిండిపోవడం, ఇటీవల ఈ ప్రాంతంలో హైడ్రా అధికారులు సందర్శించి ప్రారంభించిన పనులు అసంపూర్తిగా నిల్చిపోవడంతో నీటి ఉదృతి ఈ ప్రాంతంలో ఎక్కువగా వచ్చిందని స్థానికులు ఆరోపించారు. కొచ్చర్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న నాలా పనులు పూర్తయిన తర్వాత అప్పటి కాంట్రాక్టర్ నాలాలో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించకపోవడంతో అవి నీటి ప్రవాహానికి అంతరాయంగా మారినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. వాటి పూడిక తీసేందుకు ఇటీవల వారు ప్రయత్నించి పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే భారీ వర్షాలు కురియడంతో శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున నీరు నిల్చిపోయింది. వర్షాకాలానికి ముందే పూడిపోయిన నాలాను శుభ్రం చేయాలంటూ బస్తీ వాసులు కోరినప్పటికీ అధికారులు పనులు ప్రారంభించడంలో అలస్యం కావడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, మాతాజీనగర్, చికోటి గార్డెన్, అల్లంతోటబాయి తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం నీరు నిల్చిపోవడంతో వాహనదారులతో పాటు స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. బ్రాహ్మణవాడీలైన్ నెంబర్ 9లోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ భవనంలో కూడా వర్షం నీరు నిల్చిపోయింది. నాలా పరివాహక బస్తీల్లో భారీగా వర్షం నీరు నిల్చిపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శ్యాంలాల్ బిల్డింగ్ శ్రీ విజయగణపతి ఆలయం సమీపంలో, ఆర్‌బీఐ నివాసాల ముందు ఉన్న ఫుట్‌ఫాత్‌లపై డబ్బాలు ఏర్పాటు చేయడం, వారి రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహించడంతో ఈ ప్రాంతంలో రోడ్డు కుచించుకుపోవడంతో పాటు నీరు పోయే మార్గం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షం నీరు నిల్చిపోవడంతో ఈ మార్గంలో భారీగా ట్రాఫిక్ జాం అవుతుంది. బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1లో భారీగా వర్షం నీరు నిల్చిపోవడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.



కూకట్‌పల్లి ఏరియాలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు



మాదాపూర్ సైబర్‌టవర్స్ వద్ద వాహనాల రద్దీ



రాయదుర్గం మెట్రో స్టేషన్ కింద బారులు తీరిన వాహనాలు

**జలదిగ్బంధంలో ఇఎన్‌టి ఆసుపత్రి**

**గోషామహల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** మహానగరంలో కురిసిన వర్షానికి రహదారులు పూర్తిగా జలమయంగా మారాయి. గురువారం సాయంత్రం వాతావరణంలో మార్పు అకస్మాత్తుగా దంచి కొట్టింది. వర్షం దీంతో అబిడ్స్, నాంపల్లి, కోఠి, ఇఎన్‌టి ఆసుపత్రి రహదారి, పుత్లీబౌలి, రంగమహల్‌చౌరస్తా, ఎంజెమార్కెట్ సుల్తాన్‌బజార్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్ తదితర ప్రాంతాలల్లో వర్షం నీరు వరద ప్రవాహం కనిపించింది. పలు ప్రాంతాలల్లో ఈదురు గాలులతో కూడిన వర్షానికి రహదారులు జలమయ్యాయి. దీంతో వాహనాదారులు అనేక అవస్థలకు గురయ్యారు. ముఖ్యంగా వర్షం నీటి కాలువలలో పూడికలు సరిగా తీయకపోవడంతోపాటు అనేక చోట్ల వర్షంనీటి కాలువలపై అక్రమ కట్టడాలు ఉన్నాయి. ఏకదాటిగా గంటపాటు కురిసిన వర్షానికే ఈవిధంగా ఉంటే ముమ్ముందు వర్షాకాలంలో నగర పరిస్దితి ఏలాగా ఉంటుందో చూడాల్సిందే. అటు జలమండలి, ఇటు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగంతోపాటు నగర రోడ్లపై ట్రాఫిక్ క్రమబద్దీకరణ చేసే ట్రాఫిక్ పోలీసు, అటు లాఅండ్ అర్డర్ పోలీసుల సహకారంతో వర్షంనీటి కాలువలను కట్టడాలను నిర్మించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని వాటిని తొలగించాల్సిన అవసరం భాద్యత ఎంతైనా ఉంది. దీనికితోడు వర్షంనీటి కాలువలలో పూడికలను సక్రమంగా చేపట్టే విధంగా చూడాల్సిన అవసరం ఉంది. కేవలం ఆయా పార్టీల కార్పొరేటర్లు అక్రమ భవనిర్మాణాలను ప్రోత్సాహించడంతోపాటు వసూలు పెట్టిన శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై పెడితే ఇలాంటి వర్షాలు ఎన్నిసార్లు కురిసిన రోడ్లపై వర్షం నీరు నిలువకుండా ఉంటుందన్నారు. గంటపాటు దంచికొట్టిన వర్షానికి ఈవిధంగా ఉంటే వర్షం కాలంలో వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ఘోరంగా ఉంటుంది.

## బోనాలు సనాతన ధర్మానికి ప్రతీక

**-తెలంగాణ హైకోర్టు అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి**

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** బోనాలు ఉత్సవాలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలంగాణ హైకోర్టు అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రఘు రామ్‌రెడ్డి, ఎం.మధుసూదన్ ఆధ్వర్యంలో బోనాలు ఉత్సవాలకు ఆయన హాజరై పూజలు నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ హైకోర్టు ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్ స్వరూప్ ఊరిల్లా తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారులు వై.రంజిత్‌రెడ్డి, లైబ్రరీ కార్యదర్శి బి.కిరణ్ కుమార్, కార్యవర్గసభ్యులు డి.సత్యనారాయణ ఇతర సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ హైకోర్టు అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి

**ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి**

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారి భవిష్యవాని తెలిపారు. సోమవారం కంటోన్మెంట్ 3వ వార్డు అన్నానగర్ చౌరస్తాలో నిర్వహించిన బోనాల జాతర అనంతరం సోమవారం నిర్వహించిన అమ్మవారి భవిష్యవాని వేడుకల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భవిష్యవానిలో అమ్మవారు చెప్పిన నిబంధనలు తూచా తప్పకుండా అమలు చేస్తామని అమ్మవారి ఆలయాల నిర్వాహకులు, భక్తులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లయాల నిర్వాహకులు మద్దెల యాదగిరి, సామంతుల కిష్టయ్య, అలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు దేవులపల్లి శ్రీను, పాండు, మురళీ, మహేందర్, ధర్మేందర్, మహేశ్, బాల్‌రాజ్, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



3వ వార్డు అన్నా నగర్ బోనాలు, భవిష్యవాణి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

**మరాఠ బస్తీలో..**



అడ్డగుట్ట మరాఠ బస్తీ బోనాల వేడుకల్లో పూజలు చేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్న

**అడ్డగుట్ట, ఆగస్టు 4 ప్రభాతవార్త:** బోనాల వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి తుకారాంగేట్ మరాఠ బస్తీ, సి,డి, సెక్షన్లలో రైల్వే క్వార్టర్స్, ఇందిరా నగర్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల వేడుకలకు అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నక్క మధు లింగాని శ్రీనివాస్, పి.శ్రీనివాస్ గౌడ్ దాసరి శ్రీనివాస్ గౌడ్, అమర్, రమేశ్, మహేందర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి నివారించండి : సురేష్ రెడ్డి

**జీడిమెట్ల, ఆగస్టు 4, ప్రభాతవార్త :** సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, కృషి కాలనీ, పూష్పా గిరి, బస్తీ సాయి బాబా నగర్, పాండు బస్తీ, శివాహిల్స్, శివాలయనగర్, అల్లూరి సీత రామ రాజు నగర్, వీడిఆర్ కాలనీ తదితర బస్తిలలో మంజీరా నీరు పది రోజులకోసారి రావడంతో స్థానికులు ఇబ్బందులు పడటం చూసి సురేష్ రెడ్డి సోమవారం స్థానికులతో కలిసి జీఎం ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రెండు రోజులకొకసారి మంజీరా నీళ్ల వదలకపోతే కుత్బుల్లాపూర్ ప్రజలతో కలిసి పెద్దఎత్తున ధర్నా వాటర్ వర్క్స్ ఎండి ఆఫీస్ ఖైరతాబాద్ ముందు కూర్చుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, మహిళా అధ్యక్షురాలు మంగ, మహిళా నాయకురాలు అనిత, సూరారం కాలని నాయకులు తార సింగ్, సంతోష్ నగర్ అధ్యక్షులు కిషన్ చారి, కృషి కాలని అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, జీఎస్ కిషోర్, రాజు గౌడ్, ప్రభాకర్, మీన్ కుమార్, సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని ప్రియాంక నగర్, పుష్ప గిరి బస్తీ, పాండు బస్తీ తదితర బస్తిల నాయకులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి

**శేరిలింగంపల్లి, అగష్టు 4 ప్రభాతవార్త :** యువతరం స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుని ఉన్నతశిఖరాలను అధిరోహించేందుకు కృషిచేయటం గర్వకారణమని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజలోని లింగంపల్లి మేయిన్‌రోడ్డు రత్నదీప్ సూపర్‌మార్కెట్ బిల్డింగ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నిరూప బ్యాంక్వెట్ స్, కెటరర్ స్‌ను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల వైపు యువత నిరీక్షించకుండా సొంతంగా పెట్టుబడి పెడుతూ, స్వయం ఉపాధి పొందటం శుభపరిణామమన్నారు. లింగంపల్లిలో నిరూప బ్యాంక్వెట్ హాల్‌ను అన్ని సదుపాయాలతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని శేరిలింగంపల్లి చుట్టుపక్కల ప్రజానికం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నూకల సందీప్, పవన్‌కుమార్, గోపాల్‌యాదవ్, నటరాజ్, సయ్యద్ నయిమ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక ఆరోగ్యానికి దోహదం

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** 30 సంవత్సరాలకు పై బడిన స్త్రీ, పురుషులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని, క్రీడలకు వయసుతో సంబంధం లేదని, దాంతో ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడల్లో పాల్గొనడం చాలా మంచిదని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రా బాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసంతో పాటు శారీరక, ఆరోగ్య, క్రీడా స్ఫూర్తి పెరుగుతాయన్నారు. 90 సంవత్సరాల పై బడి ఉన్న వృద్ధులు పరుగు పందెంలో పాల్గొన్న వృద్ధులను, క్రీడా కారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే సి.హెచ్.మల్లారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్, కోశాధికారి, లక్ష్మి



జింఖానా గ్రౌండ్‌లో అథ్లెటిక్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్



లింగంపల్లిలోని పోచమ్మతల్లి అమ్మవారి ఆలయంలో తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న భేరి రామచందర్‌యాదవ్, తదితరులు

## ఘనంగా పోచమ్మతల్లి అమ్మవారి తొట్టెల ఊరేగింపు

**శేరిలింగంపల్లి, అగష్టు 4 ప్రభాతవార్త :** చెడుమార్గం శారీరకంగా తృప్తినిస్తే, సన్మార్గం ఆత్మసంతృప్తిని అందిస్తుందని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ర అధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి ఎల్సిజి క్రికెట్ గ్రౌండ్ పక్కన ఓల్డ్ లింగంపల్లి గ్రామంలోని శ్రీపోచమ్మ తల్లి యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో పోచమ్మతల్లి తొట్టెల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ అమ్మవారిని దర్శిచుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకలజనులు సంతోషంగా ఉండాలని, అందరూ అన్ని రంగాలలోని రాణించి అభివృద్ధి చెందాలని ఆయన ఆకాక్షించారు. యువత సన్మార్గంలో ప్రయణిస్తూ చక్కగా ఎదిగి చెడు మార్గంలోనికి వెళ్లకుండా సనాతర ధర్మాన్ని పాటిస్తూ అధ్యాత్మిక భావనలను అలవర్చుకోవాలని సూచించారు. శ్రీపోచమ్మతల్లి అమ్మవారి బండి కార్యక్రమంలో భాగంగా పోతరాజుల నృత్యాలు, బ్యాండ్ మేళాల ఆట, పాటలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకల బాబు, అందెల సత్యనారాయణ, జయరాం యాదవ్, భరత్, రఘుగౌడ్, కిట్టు ముదిరాజ్, కొయ్యడ మనిష్, గ్రామ పెద్దలు, యువజన నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గంగపుత్రులకు అన్నింటా సముచిత స్థానం

**మంత్రి వాకిటి శ్రీహరి**

**అఫ్జల్‌గంజ్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గంగపుత్రులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తుందని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తానని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. అఫ్జల్‌గంజ్‌లోని మహంకాళి ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహంకాళి అమ్మవారి మూడవ వార్షికోత్సవ బోనాల శోభయాత్ర 160, బోనాల సాముహిక ఊరేగింపు, పోతరాజుల గావు, నృత్యాలు గంగపుత్ర యువకులు బ్యాండ్ మేళాల మధ్య ఆటలాడారు. ఈకార్యక్రమంలో తెలంగాణ నగర గంగపుత్ర సంఘం అధ్యక్షులు చాట్ల సదానంద్, ప్రధాన కార్యదర్శి పిల్లిశంకర్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు జరిగాయి. శాసనసభ్యులు ముఠా గోపాల్, మత్స్యశాఖ చైర్మన్ మెట్టుసాయికుమార్, కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్, కందిశైలజ, మాజీ ఎం.పి అంజన్న, అమృత్‌రాజ్, ఎస్.ధన్‌రాజ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఉమేష్‌కుమార్ ,అశోక్, పురుషోత్తం, కేశవ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు భగవతి, రాజశ్రీ, రాకేష్, 29 స్థానిక సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న హన్మంత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

## సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**నిజాంపేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 33, 31వ డివిజన్లలో సీసీ రోడ్డు నిర్మాణానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిసిరోడ్ల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

## మరిన్ని ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయిస్తా

**వివేకానంద నగర్ కాలనీ, ఆగస్టు 4, ప్రభాతవార్త:** వివేకానంద నగర్ కాలనీ డివిజన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సోమవారం శంకుస్థాపన చేశారు. పలు కాలనీలలో సీసీ రోడ్లు, బీటి రోడ్లకు, ఓపెన్ జిమ్‌లకు శంకుస్థాపన చేయటం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కాలనీల అభి వృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అవసరమున్న చోట ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. ఈ కార్య క్రమంలో స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజా దేవి, మాజీ కార్పొరేటర్ రంగారావు, బిజెపి నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వడ్డేపల్లి రాజేశ్వరరావుతో ఎల్ రాజా కుటుంబ సభ్యులు

## రాంకీ పల్స్ విల్లాస్‌లో గృహప్రవేశ వేడుకలు

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 4, ప్రభాతవార్త :** కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని శాతవాహన నగర్ రామ్కి ఫల్స్ విల్లాస్‌లో సీనియర్ నాయకులు ఎల్ రాజా నూతన గృహప్రవేశ వేడుకల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాల స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులైనారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు రాజాని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న మిత్రులను అందరిని ఆప్యాయంగా పలకరించారు.

## 17న వినాయకనగర్ బస్తీ ఎన్నికలు

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 04, ప్రభాతవార్త:** రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ వినాయకనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఈనెల 17న జరగనున్నాయి. అందుకుగాను ఈనెల 11, 12వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని 12వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సా.4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 17వ తేదీన స్థానక కమ్యూనిటీ హాల్‌లో ఉ.7.30 గంటల నుంచి సా.4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని అనంతరం ఓట్ల లెక్కింపు ఫలితాలను ప్రకటించటం జరుగుతుందని ఎన్నికల అధికారులు కాజా మోయినుద్దీన్, యాకుబ్, ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. సొంత నివాసం కలగిని వవారు ఒక కుటుంబం నుంచి రెండు ఓట్లు వేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వీరస్వామి యాదవ్, మణిక్యం, కేశవులు, ఎఫ్ శ్రీనివాస్, డానియల్, ఆంజనేయులు, బీ.శ్రీనివాస్, యాదగిరి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## బోనాల వేడుకల్లో రాజశేఖర్‌రెడ్డి పూజలు

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** అమ్మవారిని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ 3వ వార్డు అన్నా నగర్ చౌరస్తాలోని పలు అమ్మవారి దేవాలయాల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మాజీ బోర్డు మెంబర్ అనితా ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను బిఆర్ఎస్ నేత దేవులపల్లి శ్రీను శాలువకప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

# కొత్త అవకాశాల కోసం అన్వేషించండి



ప్రసంగిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి పీవీ రమణ కుమార్

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆటోనోమస్ కళాశాల పీజీ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ చదువును పూర్తిచేసుకొని జీవితంలో తదుపరి అధ్యాయానికి అడుగుపెడుతున్న ఈ సందర్భంలో పలువురు ప్రముఖులు వివిధ అంశాలపై ప్రసంగించారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి పీవీ రమణ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధన, బోధన, పరిశ్రమల ఇతర రంగాల్లో కొత్త అవకాశాల అన్వేషణ కావచ్చు సంస్థలో నేర్చుకున్నది ఉపయోగ పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ మట్టా, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ డి. యాదగిరి, డైరెక్టర్ విష్ణు ప్రియ,డా. ఎన్. వెంకటేష్, టి. అశోక్ గౌడ్. రూపా తదితరులు మాట్లాడారు. కళాశాలలో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# పెండింగ్‌లో పనులను త్వరలో పూర్తి చేస్తాం

**-జిహెచ్ఎంసి కమిషనర్**



జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు త్వరలో ఆమోదం తెలిపి వాటి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ వివిధ సమస్యలకు ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్పొరేటర్ వెంట బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ కూడా ఉన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పారిశుద్ధ్యం పనులు మెరుగుపరచాలని కార్పొరేటర్ సూచించారు. డివిజన్‌లో నిధులు మంజూరై పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, వాటితో పాటు జిహెచ్ఎంసి పారిశుధ్యం పనులను మెరుగుపరచాలని కోరారు. డివిజన్ లో శానిటైజేషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, అలాగే పెండింగ్ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి వహించి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు. వీటితోపాటు వాటర్‌బోర్డు ఏర్పాటు చేసే నూతన సీవారేజి పైప్ లైన్ పనులకు అనుకూలంగా రోడ్డు త్రవ్వకాలకు అనుమతి ఇవ్వాలని కమిషనర్‌ను కోరగా సానుకూలంగా స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులను సమన్వయ పరిచి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పాఠశాల స్థాయిలోనే పిల్లలకు టీకాలు వేయించాలి

**చిక్కడపల్లి ఆగస్టు 4 ప్రభాతవార్త:** టీకా ద్వారా నివారించగల వ్యాధుల నుండి పిల్లలను రక్షి ంచడానికి పాఠశాల వయస్సు నుండే బూస్టర్ డోసులు వేయాల్సిన అవసరం ప్రముఖ వైద్యుడు డాక్టర్ బాబు ఎస్.మదార్కర్ అభిప్రాయపడ్డారు. ఇటీవలికాలంలో చిన్న పిల్లలకు టీకా కవరేజ్ పరంగా గణణీయమైన ప్రగతి సాధించడం జరిగిందన్నారు. ఫలితంగా నాలుగు తీవ్రమైన రక్షణ నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. సోమవారం చిక్కడపల్లిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పాఠశాల ప్రవేశ వయస్సులో పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు, పోలియోకు వ్యతిరేకంగా బూస్టర్ డోస్‌ను సకాలంలో అందించాలని, బాల్యంలో అందించే టీకాలు ముందస్తు రక్షణకు పునాది వేసినప్పటికీ, ఆ రోగనిరోధక శక్తి కాలక్రమేణా బలహీనపడుతుంది. అందుకే పిల్లలకు నాలుగు మరియు ఆరు సంవత్సరాల మధ్య ఆ రక్షణ ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ నేషనల్ ఇమ్మ్యునైజేషన్ ప్రోగ్రామ్ (ఎన్ఐపి) కింద 6, 10, 14 వారాలలో డీటీపీ టీకాలు, 16 నుండి 24 నెలలకు బూస్టర్‌తో కూడిన టీకాలు వేయాలని, పోలియో టీకాలు కూడా 6, 14 వారాలలో పాక్షి క మోతాదులలో ఇవ్వబడతాయని, అయితే, నాలుగు సంవత్సరాల వయస్సులో యాంటీబాడీ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయన్నారు. పొరుగు దేశాలలో పోలియోవైరస్ వంటి వ్యాధులను నిరంతరం గుర్తించడం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న ప్రాంతాలలో దాని నిశ్శబ్ద వ్యాప్తిని నివారించే చర్యలు తీసుకుంటారని, ఈ దిశగా తగు జాగ్రత్త లు తీసుకుంటుంటారు. జనాభా స్థాయి లో రోగనిరోధక శక్తిని కొనసాగించకపోతే తిరిగి పుంజుకునే ప్రమాదం ఉందని ప్రపంచ జాతీయ నిఘా డేటా నిర్ధారించిందన్నారు. "పాఠశాల ప్రవేశ వయసులో బూస్టర్ టీకాలు ఇమ్యూ నైజేషన్ షెడ్యూల్‌లో ఒక ముఖ్యమైన తనిఖీ కేంద్రంలా పనిచేస్తుంది. ఇది ఏదైనా తప్పిపోయిన లేదా ఆలస్యమైన మోతాదుల కారణంగా ఎదురయ్యే సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. నిరంతర ప్రయత్నాల కారణంగా నియంత్రణలో ఉన్న వ్యాధుల నుండి మన మొత్తం రక్షణను బలోపేతం చేస్తుంది" అని డాక్టర్ రావు జోడించారు.

# ఏకలవ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చేయాలి

**-ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి**

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా తనవంతు కృషి చేస్తానని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ హామీ ఇచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎరుకల హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఎరుకుల ఉద్యోగుల హక్కుల రాష్ట్ర కో కన్వీనర్ ఒలు గుత్తుల పోచయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఈ వర్గాలకు న్యాయం జరిగే విధంగా చూస్తాననాననరు. ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు వలిగి ప్రభాకర్ మాట్లాడుతూ గతంలోనే ఈ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ జీవో 5ను జారీ చేసిందని వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు రూ.500కోట్లు బడెట్ కేటాయించి ఈ వర్గాల అభ్యున్నతికి తోడ్పాటును అందించాలని డిమాండ్ చేశారు. ఈ సభలో ఎరుకుల ఉద్యోగుల హక్కుల జాతీయ కో కన్వీనర్ శ్రీనివాస్ గరిక శ్రీనివాసులు, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ కమిషన్ సభ్యుడు నరహరి ప్రసాద్, ఎరుకుల ఉద్యోగుల సమైక్య రాష్ట్ర కోకన్వీనర్ కూరాకుల సమ్మయ్య, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, మోకుదెబ్బ వ్యవస్థాపకులు ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, ఆలిండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు దేవరాయ సాయిలు, దాసరి కిషన్, కూతాడి నరసింహా, వజ్జగిరి అంజయ్య, వొలుగుమాను బలరామ్, ఓలుగుత్తుల పోచయ్య, మానుపాటి కృష్ణ, ఎపి నేతలు ద్రాక్షం శ్రీనివాసులు, మైచర్ల దుర్గారావు, చల్ల చిరంజీవి, దాసు నూకరాజు, ఇట్టా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నలుగురు నిందితులు అరెస్టు

**రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు**

**అల్వాల్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** ఇంటి తాళాలు పగలు కొట్టి చోరీకి పాల్పడిన నలుగురు నిందుతులను అరెస్టు చేయడంతో పాటుగా భారీగా సొత్తును అల్వాల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాంకేతికత ఆధారంగా ప్రధానంగా సిసి కెమెరాలను జల్లెడ పట్టడం ద్వారా పోలీసులు దొంగలను స్వల్ప వ్యవధిలోని పట్టుకోగలిగారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ అంజనీపురి కాలనీలో నివసించే సుశాంత్ కుటుంబంతో కలిసి ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆంధ్రాకు వెళ్ళడం జరిగింది. జూలై 29 అర్ధరాత్రి తాళం వేసిన ఇంటలోకి చొరబడిన దొంగలు బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు ఇతర వస్తువులను తస్కరించారు. 26 తులాలు బంగారు ఆభరణాలు, 20 గ్రాములు వెండి వస్తువులు, 20వేలు నగదు దొంగించబడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు మొత్తం 50 సిసి కెమెరాలను పరిశీలించారు. దొంగతానికి పాల్పడింది పాత నేరస్తులుగా గుర్తించారు. హైదరాబాద్ నగరం పాత బస్తీకి చెందిన చిత్ర లేఖనం కార్మికుడు సయ్యద్ సోహైల్(22), రాజేంద్రనగర్ వాస్తవ్యుడైన చిత్ర లేఖన కార్మికుడు మహ్మద్ మోసిన్(25) ఇదే ప్రాంతానికి చెందిన ఎసి మెకానిక్ మహ్మద్ సమీర్(26) నిర్ధారించుకున్నారు. చోరీ చేసిన ఆభరణాలను కొనుగోలు చేసింది సంగారెడ్డికి చెందిన షేక్ సైఫుల్‌లుగా గుర్తించారు. నలుగురు నిందితులు గతంలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలులో జరిగిన దొంగతనాలు కేసులులో నిందితులుగా ఉన్నారు. తాడేపల్లి, హుస్నాబాద్, వట్టేపల్లి, నల్గొండ, నాగర్ కర్నూల్, వరంగల్, సూర్యాపేట్‌లలో ఇంటి, బైక్‌లు దొంగతనాలుతో పాటుగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఈ నెల 3వ తేదీన ఓల్డ్ అల్వాల్ ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా బైక్‌పై సంచరిస్తున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగింది. నిందితులు నుంచి పల్సర్ బైక్‌తో పాటుగా వెండి వినాయక విగ్రహం, 50వేలు నగదు, ఇనుప రాడ్, 5 మొబైల్ ఫోన్‌లు రికవరీ చేశారు. కరుడుగట్టిన నేరగాళ్ళగా కేసులు నమోదైన నేపథ్యంలో మరింత లోతుగా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# గణేష్ ఉత్సవ సమితి సమావేశం

యాకుత్‌పుర,ఆగష్టు 4 ప్రభాతవార్త : పాతబస్తీ గౌలిపురలోని శివ పార్వతి ఫంక్షన్ హాల్‌లో సోమవారం గణేష్ ఉత్సవ సమితి సమావేశం జరిగింది.ఈ కార్యక్ర మంలో శ్రీ సాయి దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ రామానంద ప్రభుజీ,ఉత్సవ సమితి కార్యదర్శి మహేందర్,సెంట్రల్ కమిటి సభ్యులు రూప్ రాజ్,శ్రీను,అసెంబ్లీ కన్వీనర్ శ్రీనాథ్,రాజేష్,డివిజన్ కన్వీనర్ సాకేత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# పేద ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత అందరిది

**చార్మినార్,ఆగష్టు 4 ప్రభాతవార్త :** పాతబస్తీ దూద్‌బౌలి మహరాజ్‌గంజ్ ప్రాంతానికి చెందిన సంఘ సేవకులు రవీందర్ గౌడ్ అగ్రసేన్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అధ్యక్షులు ప్రమోద్ కుమార్ కేడియో,సీనియర్ ఉపాధ్యక్షులు సురేష్ కుమార్ అగర్వాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సంఘసేవకులు రవీందర్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.

# ముంచేసిన వాన

(మొదటి పేజీ తరువాయి)

స్కూళ్ల నుంచి విద్యార్థులు వెళ్లే సమయంలో వర్షం పడటంతో పరిస్థితి దయనీయంగా మారింది. ద్విచక్రవాహనదారులు, పాదచారులు వర్షం నుండి తప్పించుకోవడానికి ఫ్లైఓవర్లు, దుకాణాల షెడ్ల కింద తలదాచుకున్నారు. ఉప్పల్, రామంతాపూర్, నాచారం, తార్నాక, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, రసూల్‌పురా, మధురానగర్, బోరబండ, యూసుఫ్‌గూడలో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్, మెహదీపట్నం, లంగర్‌హౌస్, కార్వాన్, గోల్కొండ, ఖైరతాబాద్, లక్డీకపూరల్, మాదాపూర్, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, వివేకానందనగర్, హిమాయత్‌నగర్, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, కాప్రా, నేరేడ్‌మెట్, మల్కాజ్‌గిరి, అల్వాల్, జియాగూడ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఫిలింనగర్, ఎల్‌బీనగర్, వనస్థలీపురం, నాగోల్, మల్కాజ్‌గిరి, జవహర్‌నగర్, కాప్రాలో భారీ వర్షం కురిసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. భారీ వర్షం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ జీహెచ్ఎంసీ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని చెప్పింది. వర్షాలతో జీహెచ్ఎంసీ, హైడ్రా అప్రత్తమైంది.

**వాహనదారులకు నరకయాతన..**

వానొస్తే..ట్రాఫిక్ జామ్‌లకు ఐటీ కారిడార్ కేరాఫ్‌గా మారింది. మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ఐటీ హబ్‌గా ఉండగా ట్రాఫిక్ సమస్య అదే స్థాయిలో ఉంది. అరగంట వాన పడితే చాలు..మెయిన్ రోడ్లన్నీ చెరువులా మారుతున్నాయి. సోమవారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది. శిల్పారామం ఎదురు బస్టాప్, కొత్తగూడ బస్టాప్, మాదాపూర్ బాటా షోరూం, నెక్టార్ గార్డెన్, రాయదురనగం మెట్రో స్టేషన్ కింద. బయోడైవర్సిటీ జంక్షన్, ఐఐఐటీ ఎదురుగా, గచ్చిబౌలి ఏఈ ఆఫీస్, రాడిసన్ హోటల్, ఐకియా వెనకాల రోడ్డుపై వరదనీరు నిలిచిపోతుండటంతో క్లియర్ అవ్వడానికి గంటల కొద్దీ సమయం పట్టింది. కార్లు, బస్సులు, బైక్‌లు ఒకటి, రెండు లేన్లలో వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. జేఎన్‌టియూ నుంచి ఐకియా మమీదుగా బయోడైవర్సిటీ రూట్ రెండు వైపులా, షేక్‌పేట్ నుంచి ఖాజాగూడ మీదుగా గచ్చిబౌలి రూట్, లింగంపల్లి నుంచి గచ్చిబౌలి రూట్ అంతా ట్రాఫిక్ నిలిచిపోయింది. వాన పడితే లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి మునిగిపోతున్న పరిస్థితి.



లక్డీకపూల్ ప్రాంతంలో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

## రంగంలోకి దిగిన హైడ్రా

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** నగరంలో సోమవారం భారీ వర్షం కురిసింది. గంట వ్యవధిలో 7 నుంచి 8 సెంటీమీటర్ల వరకూ వర్షపాతం నమోదైంది. దీంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాం. భారీ వర్షం పడే అవకాశాలను రెండు గంటల ముందుగానే గ్రహించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో ఉండే అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజావాణి ఫిర్యాదులను పరిశీలిస్తున్న సమయంలోనే భారీ వర్షం కురవడంతో కమిషనర్ నేరుగా వరద ముప్పు ఉన్న ప్రాంతాలకు వెళ్లారు. లక్డీకాపూల్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఉన్న డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు.. హైడ్రా మాన్సూన్ ఎమర్జన్సీ బృందాలతో మాట్లాడి వరద ముప్పు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కొన్ని చోట్ల చెట్లు విరిగి పడగా.. సిబ్బంది వాటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. మరికొన్న చోట్ల వరదకు చిక్కుకున్న కార్లను పక్కకు తొలగించి.. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. జూబ్లీహిల్స్, జీడిమెట్ల, ఉప్పల్ ఇలా అన్ని ప్రాంతాల్లో జీహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయంగా పని చేసి ట్రాఫిక్ జామ్‌లు లేకుండా చూశారు. రోడ్డు అండర్ బ్రిడ్జిల వద్ద ఆటోమేటిక్ డీవాటర్ పంపులకు తోడుగా హైడ్రా నీటి పంపులను కూడా ఉంచి.. వరద ముప్పు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఎక్కడైనా వరద ముప్పు ఉన్నట్లయితే రౌండ్‌ది క్లాక్ పని చేసే హైడ్రా కంట్రోల్ రూమ్ (9000113667)కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఖాజాగూడ లాంకోహిల్స్ సర్కిల్‌లో పిడుగుపాటు

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** గచ్చిబౌలి పరిధిలోని ఖాజాగూడ లాంకోహిల్స్ సర్కిల్ హెచ్‌పి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న తాటి చెట్టు పైన పిడుగు పడింది. పిడుగుపాటుతో చెట్టు మొత్తం కాలిపోయింది. గమనించిన స్థానికులు ప్రాణభయంతో పరుగులు తీశారు.

# వన మహోత్సవంలో భాగస్వాములవ్వాలి

**- నార్సింగి మున్సిపల్ ప్రత్యేకాధికారి హరిరతన్**

**నార్సింగి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద స్వచ్ఛందంగా మొక్కలు నాటుకొని వన మహోత్సవంలో భాగస్వాములవ్వాలని నార్సింగి మున్సిపల్ ప్రత్యేకాధికారి హరి రతన్ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంజిఐటి కళాశాలలో "వనమహోత్సవం"ను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డితో కలిసి కమీషనర్లు హరి రతన్, కృష్ణమోహన్‌రెడ్డి, ఎన్‌సిసి కో ఆర్డినేటర్ బాల్‌రెడ్డి, ప్రొఫెసర్ చందర్ విద్యార్థులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హరిరతన్ మాట్లాడుతూ ఎక్కడ అడవులు ఎక్కువగా ఉంటే అక్కడ వర్షాపాతం అధికంగా నమోదవుతుందని, భూగర్భ జల మట్టం పైపైనే ఉంటుందని, జలాశయాలు నిండుతున్నాయని, పంటలు బాగా పండుతున్నాయని వివరించారు. తెలంగాణలో చెట్ల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవంను నిర్వహిస్తుందని, ప్రజలంతా తమ ఇళ్ల ముందు బిడ్డల పేర్లతో మొక్కలు నాటి, మూడేళ్ల పాటు సంరక్షించాలని సూచించారు. మనం నాటిన మొక్కలు మన జీవితాంతం మనకు ప్రాణ వాయువును ఇస్తాయని తెలిపారు. యువకులు, మహిళా సంఘాలు, కాలనీ సంఘాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులందరిని వన మహోత్సవంలో భాగస్వాములను చేసి పెద్ద ఎత్తున మొక్కలు నాటించాలని ప్రేత్యకాధికారి హరి రతన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఇఇ నరేష్, ఏఈ శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత చదువులకు చేయూతనివ్వడం అభినందనీయం

**నార్సింగి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీకి చెందిన పేద విద్యార్థులు చక్రిక, పూజాసింగ్‌లకు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫీజును బిఆర్ఎస్ నాయకులు బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి, విఆర్4 ట్రస్టుతో కలిసి చెల్లించారు. దీంతో కష్టపడి చదువుకున్న చక్రిక 462/470, పూజాసింగ్ 439/470 మార్కులు సాధించారు. వీరిద్దరికి రెండో సంవత్సరం ఫీజును సోమవారం కార్తిక్‌రెడ్డి చేతుల మీదుగా ఇప్పించారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి మంచి పనులు చేసేందుకు మరింత మంది ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసిన దాతల దాతృత్వంను చూసి ఇతరులు స్ఫూర్తి పొందుతారని, మరికొందరు కూడా ఇలాంటి మంచి పని చేసేందుకు ఉత్సుకత చూపిస్తారని తెలిపారు. విద్యార్థులు సైతం కష్టపడి చదువుకొని మెరిట్ మార్కులు సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, అందె లక్ష్మణ్‌రావ్, ప్రతినిధులు సుమ నళిని, నరేందర్, రామ సుబ్బారెడ్డి, ఆరిఫ్ మహ్మద్, సుమన్, శేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థుల కళాశాల ఫీజుకు సంబంధించిన చెక్కును అందజేస్తున్న కార్తిక్‌రెడ్డి

# ప్రజాసమస్యల ఆర్జీలపై సత్వరమే స్పందించాలి

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల అర్జీలపై సత్వరమే అధికారులు స్పందించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలనితో కలసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలన చేసి పరిష్కరించాలని అన్నారు. వికలాంగులు, వయోవృద్ధుల అర్జీ సమర్పణ సులభతరం చేసేందుకు సి.ఎం సూచనల మేరకు గత వారం ప్రవేశపెట్టిన వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే అర్జీలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో 251 అర్జీలు రాగా అందులో హౌసింగ్ శాఖ 151 (2బి.హెచ్.కె 25, ఇందిరమ్మ ఇండ్లు 126), పెన్షన్స్ 33, కలెక్టరేట్ సెక్షన్లు 23, ఆర్.డి.ఓ మరియు తహసిల్దార్ 8, ఇతర శాఖలు 36 కలవని కలెక్టర్ పేర్కొన్నారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ యొక్క వాల్ పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి, సిపిఓ డాక్టర్ ఎన్. సురేందర్, డి ఎం ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటి,వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.




అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

# చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నకు అభినందన

**చార్మినార్,ఆగష్టు 4 ప్రభాతవార్త :** పాతనగరంలో ఇటీవల జరిగిన ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేసినందుకు పాతనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి తరుపున కమిటి చైర్మన్ జి.రాఘవేందర్ సోమవారం జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి ధన్య వాదాలు తెలిపారు.

# నివాసిత ప్రాంతాలకు పార్కులే ప్రాణం

(మొదటి పేజీ తరువాయి)

బాచుపల్లి గ్రామంలో శ్రీ సాయి కృష్ణ కాలనీలో 1700 గజాల పార్కు స్థలాన్ని కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణిలో అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. అలాగేరంగారెడ్డి జిల్లా, గండిపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 69లో లే ఔట్ ప్రకారం 25 అడుగుల రహదారి ఉండగా దానిని ఆక్రమించేశారని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం భగత్ సింగ్ నగర్లో 3500 గజాల స్థలాన్ని ప్రజావసరాలకు కేటాయించగా.. ఇప్పుడది కబ్జాల పాలౌతోందని భగత్‌సింగ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి స్థల పరిరక్షణ కమిటీ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. దీనిని కాపాడేందుకు పలుమార్లు జీహెచ్ ఎంసీ నిధుల కేటాయించడం కూడా జరిగిందని..ఈ స్థలాన్ని కాపాడితే.. అక్కడ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని కమిటీ ప్రతీనిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఫిష్ వెంకట్ కుటుంబానికి నేనున్నా

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని రోజుల క్రితం మరణించారు. వెంటనే స్పందించిన సోనూసూద్ తన వంతుగా వెంకట్ కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన సంగతి తెలిసిందే. వారి దీనస్థితిని తెసుకున్న ప్రముఖ బాలీవుడ్ నటుడు, రియల్ హీరో ఫిష్ వెంకట్ కుటుంబానికి గతంలోనే ఆర్థిక సాయం ప్రకటించారు. తన వంతుగా లక్షన్న రూపాయల సాయం అందజేసి ఆ కుటుంబాన్ని ఆదుకున్న సంగతి తెలిసిందే. ఈ మొత్తాన్ని బ్యాంక్ ద్వారా ఫిష్ కుటుంబానికి అందేల చేసిన ఆయన ఇప్పుడు స్వయంగా ఆయన కుటుంబానికి కలిసి పరామర్శించారు. సోహైదరాబాద్ వచ్చిన ఆయన అడ్డగుట్టలోని ఫిష్ వెంకట్ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు.

# కొండెక్కిన కనకాంబరం

(మొదటి పేజీ తరువాయి)

అతి తక్కువ ధరకు అడుగుతుండడంతో వ్యాపారం బాగా జరగడం లేదు. సీజన్ లో కూడా వ్యాపారాలు అంతగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో మార్కెట్ కు పూలు ఎక్కువగా వచ్చేవి, ఈ సీజన్ లో మాత్రం తక్కువగా వచ్చాయి.

**పండుగలను ఇష్టంగా చేసుకోలేకపోతున్నాం: రేణుక**

పూల ధరలు ఎక్కువగా ఉండటంతో పండగలను ఇష్టంగా చేసుకోలేకపోతున్నాం. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. గతంలో నాలుగు, ఐదు కేజీలు కొనే వాళ్ళము. ఇప్పుడు ఒకటి, రెండు కేజీలు మాత్రమే కొంటున్నాము. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

# మృతుని కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే తలసాని పరామర్శ

**సంజీవరెడ్డినగర్, ఆగస్టు 04, ప్రభాతవార్త :** మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి సంతాపం సానుభూతి తెలిపారు. సనత్‌నగర్‌లోని దాసారం బస్తీ మాజీ అధ్యక్షులు యాదగిరి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కుమార్ సోదరుడు సతీష్ ఆదివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం వారి నివాసానికి వెళ్లి పార్థిదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ దేశ్‌కుమారి, అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, హనుమంతరావు, నాయకులు అశోక్‌యాదవ్, నరసింహ, బలరామ్, వనం శ్రీనివాస్, కొలన్ భూపాల్‌రెడ్డి, ఏ.రాజు తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను ప్రజల ముందుంచాలి

**ముషీరాబాద్, ఆగస్ట్ 4, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదికలోని వాస్తవాలను ప్రజల ముందుంచాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ దశాబ్దంలో అతిపెద్ద కుంభకోణమైన కాళేశ్వరం అవినీతిని కనుమరుగు చేసే పన్నాగాలు చెల్లవని స్పష్టం చేశారు. తక్షణమే పారదర్శకంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ అవకతవకలపై విచారణ జరిపించి, దోషులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, ఎబిఆర్ మోహన్, సుక్రవేది పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ ఫీజు విత్ డ్రా గడువును పొడిగించాలి

**హైదరాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ ద్వారా సీటు పొందిన విద్యార్థులు చెల్లించిన కళాశాలల ఫీజు విత్ డ్రా గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



# జూబ్లీహిల్‌కు మాగంటి ఎనలేని సేవలు అందించారు

**మాజీ మంత్రి మహ్మద్ అలీ,ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్**

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరువలేరని మాజీ మంత్రి మహ్మద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్‌లు అన్నారు. బోరబండ సైట్3లోని పీజేఆర్ మైదానంలో జూబ్లీహిల్స్ శాసనసభ్యులు దివంగత మాగంటి గోపీనాథ్ సంతాప సభను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే పీ విష్ణువర్ధన్‌రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే రావుల శ్రీధర్‌రెడ్డి, సోహెల్, మాగంటి సతీమణి మాగంటి సునీతా గోపీనాథ్ తదితరులు హాజరయ్యారు. మాగంటి గోపీనాథ్‌తో పాటు మైనారిటీ నాయకుడు సర్దార్ చిత్రపటాల వద్ద నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహ్మద్ అలీ, దాసోజు శ్రావణ్‌లు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల బస్తీల కాలనీల అభివృద్ధికి మాగంటి గోపీనాథ్ ఎనలేని సేవలు అందించారని ఆయన సేవలను ఎన్నటికీ మరువలేరన్నారు. ముఖ్యంగా బోరబండను అన్ని విధాల అభివృద్ధి పథంలో తీర్చిదిద్దిన మాగంటి రుణం తీర్చుకోవాలంటే ప్రజలు త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత సంతాప సభలో దాదాపు 3 వేల మందికి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం సభకు తరలివచ్చిన వేలాది మందికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేదిప్యా విజయ్‌కుమార్, రాజ్‌కుమార్ పటేల్, డివిజన్ అధ్యక్షులు కృష్ణమోహన్, రమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.9, చార్మినార్ జోన్

సంక్షిప్త టెండర్ ప్రకటన నం.32/EE.Div.No.9/GHMC/2025-26, తేది: 02.08.2025
నిట్ నం: పైన పేర్కొన్నది. పని వివరణ: నిర్వహణ పనులు (09) నం.లు, అంచనా మొత్తం: రూ.62.95 లక్షలు. బిడ్స్ స్వీకరణ ప్రారంభ తేదీ/చివరి తేదీ, సమయం: ప్రారంభ తేది: 04.08.2025 మ.03.00 గం. స్వీకరించు చివరి తేది, సమయం: 07.08.2025 మ.03.00 గం., అధికారి పేరు, చిరునామా, సెల్ నం. శ్రీ కె. హరి కిషోర్, 9849906768.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-9, CRZ, GHMC
DIPR.No.5970-PP/CL/Advt/1/2025-26, తేది: 04.08.2025

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME
★ B. AKHILA D/o B. KOMURAIAH, R/o H.No.3-15-87, Navarangguda, Ramanthapur, Hyd, have changed my name as SHAIK ANAM W/o. SHAIK SALEEM for all record purposes.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE, MEDCHAL MALAKJGIRI DISTRICT AT MALAKJGIRI
E.P.NO. 117 OF 2024
IN
O.S.NO. 1681 OF 2017
Between:
S. Seema Sharma, ...Decree Holder
AND
Ch. Narsimha Reddy ...Judgment Debtor
To
Ch. Narsimha Reddy, S/o. Ch. Surender Reddy, Age: 48 yrs, O/c. Pvt., Service, R/o. Plot No. 13/A, Shiva Reddy Guda, Ghatkesar Mandal, R.R.District.
WHEREAS the above named Petitioner has made an application to this Court for delivery of possession. YOU are hereby wanted to appear in this court in person or through advocate duly instructed on the day of 25-8-2025 at 10-30 a.m. to show Cause against the Application failing which the said Application will be heard and determined experty.
GIVEN under my hand the Seal of the Court this day of ______2025
BY ORDER OF THE HON'BLE COURT
Sd/- P S N Sarma & N R BHAGAVAN advocates
#203 Siva Sai Residency, Budhanager, Near Uppal Bus Depot, Hyderabad-92
Cell No. 9848911958
Counsel For the DHR

IN THE COURT OF THE HON'BLE III AJCJ COURT :: AT: MALKAJGIRI
O.S.NO. 600 OF 2025
BETWEEN:
Depuri Nandamma & 7 Ors .....Plaintiffs
AND
The Tahsildar, Malkajgiri
All Concerned ...Defendants
Please take Notice that the above named Plaintiffs filed a suit for Declaration, to declare the Plaintiffs are the Legal Heirs of Late Depuri Sambaiah and the same is stand posted to 01.09.2025 if anybody having any objection in the above suit, appear at 10.30 am before this Hon'ble Court in person or by an advocate, failing which the Hon'ble Court will proceed with the matter as per the law.
//By Order of the Hon'ble Court//
SANGEETHA TALARI
Advocate
#8-3-237/7, NEELAMMA NILAYAM, Yousufguda, Hyderabad.
Ph: 98480 20496; 7780222670

## సమస్యలను పరిష్కరించాలి : కార్పొరేటర్



మల్కాజిగిరి ఆగస్టు4,ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్ లో గత కొద్ది రోజుల్లో నుండి మంజీరా వాటర్ కలుషిత నీరు వస్తుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది వెంటనే స్పందించి జలమండలి జిఎం సునీల్ కుమార్ మేనేజర్ నవీన్ తో కలిసి పరిశీలించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజు, ఉమర్, కృష్ణవేణి, సంతోషి, యాదమ్మ, కుమార్, బబిత, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి



నేరెడ్‌మెట్, ఆగస్టు 4 ప్రభాతవార్త: మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో భాగమైన బలరాం నగర్ కాలనీకి సంబంధించి వాసులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ కార్పొరేటర్ నల్లగొండ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.కాలనీలో ఓపెన్ నాళాలు పొడి మురుగుతో నిండి ఉండటం, వర్షాల్లో విద్యుత్ షాక్ ప్రమాదం ఉన్న ఐరన్ స్తంభాలు, రహదారులు ఇబ్బందికరంగా ఉండడం, పలు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వంటి సమస్యలు కీలకంగా చర్చకు వచ్చాయి. 7-8 ఐరన్ విద్యుత్ స్తంభాలను తొలగించి, బదులుగా సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని నివాసితులు కోరారు.కొన్ని వీధుల్లో సీసీ రోడ్లను వేయించాలని, డ్రైనేజీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. నివాసితుల వినతులను పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.సమావేశంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు కిషోర్ సింగ్, వెంకటేశ్, గోపాల్ సింగ్, అద్వైత్ కుమార్, సతీష్, రామ్, మోహన్ సింగ్, నాగేశ్, కన్నారెడ్డి, నాయ్క్, ఉమా, కరుణ, సుజాత, శేషాంక్, రవి తదితరులు పాల్గొన్నారు. వందలాదిగా వాసులు హాజరై సమస్యలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

## యోగా గురువు అల్లాడి పరమేశ్వర్‌కు సువర్ణ కంకణ అవార్డు



సువర్ణ కంకణ అవార్డును అందుకుంటున్న యోగాచార్య అల్లాడి పరమేశ్వర్.

వనస్థలిపురం. ఆగస్టు.4.ప్రభాతవార్త : వనస్థలిపురం లోని యోగా గురువు అల్లాడి పరమేశ్వర్ కు సువర్ణ కంకణ అవార్డ్ లభించింది.70 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖుల కు లలిత సేవా సమాఖ్య వారు సువర్ణ కంకణాలను నగరంలో ని త్యాగరాయ గానసభ లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా అందజేశారు. అందులో భాగంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సామాజిక సేవలో భాగంగా ఉచితంగా యోగా శిక్షణ అందజేస్తున్న అల్లాడి పరమేశ్వర్ సేవలను గుర్తించి, సువర్ణ కంకణ అవార్డు ను ముఖ్య అతిథులు ఎమ్మెల్సీ లు రుద్రరాజు పద్మరాజు,బొగ్గరపు దాయానంద్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ల చేతుల మీదుగా పరమేశ్వర్ అందుకున్నారు.పరమేశ్వర్ కు అవార్డ్ రావడం పట్ల విశ్వ జ్యోతి ఉచిత యోగా సంస్థ సభ్యులు, ఎచ్.ఎం. డి.ఏ.పార్కు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నీల రమేష్, బండారు మల్లేష్,బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు పిపిఈ కిట్ల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు పీ.పీ.ఈ.కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

వనస్థలిపురం. ఆగస్టు.4.ప్రభాతవార్త : బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న జి.ఎచ్. ఎం.సి. పారిశుధ్య కార్మికుల కు సాహెబ్ నగర్ లోని ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రభుత్వం నుండి వచ్చిన పీ.పీ.ఈ. కిట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం కాలనీలలో వీధులను శుభ్రం చేస్తూ,ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న వారి కి వారి ఆరోగ్యం కాపాడుకోవడానికి ఈ కిట్లను పంపిణీచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జి.ఎచ్. ఏం. సి. శానిటేషన్ డి. ఈ. నీలిమ,అజీముద్దీన్,జవాన్ యాదయ్య,బి.జె.పి.డివిజన్ ప్రధాన కార్యదర్శి గంగం ప్రేమ్ నాథ్,మహేష్ గౌడ్,చిత్తరంజన్, శశి కాంత్,నందకిషోర్,సిబ్బంది బాలకృష్ణ,పురుషోత్తం, గోవర్ధన్ రెడ్డి,ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## గణేష్ మండప నిర్మాణానికి కర్ర పూజ




వనస్థలిపురం. ఆగస్టు.4.ప్రభాతవార్త వనస్థలిపురంలోని రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద అభిమన్యు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు బీరం శ్రీధర్ ఆధ్వర్యంలో కర్ర పూజా కార్యక్రమం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు దీపాల రాజేష్ కుమార్,సుధీర్ కుమార్,శ్రవణ్ కుమార్,పోనుగోటి శ్రీధర్ రావు,పాండు గౌడ్,మాణిక్యం,సునీల్ రెడ్డి, జగదీశ్ గౌడ్,శ్యామ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వం లక్ష్యం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



అనాజ్‌పూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ ఆగస్టు4,ప్రభాతవార్త : ప్రతి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నదే ప్రజాప్రభుత్వం లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి అన్నారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్ పూర్, గుంతపల్లి, మజీద్ పూర్ గ్రామాలలో రూ.80 లక్షలతో నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అయినా మంజూరు చేస్తామని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసమే తాను పనిచేస్తున్నానన్నారు. ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ను అందిస్తున్నామని, అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం ప్రజలకోసం కాకుండా కమీషన్ల కోసం పనిచేస్తే ప్రస్తుతంప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రోజు ప్రజల కోసం పని చేస్తున్నదన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం హరిత హారం కార్యక్రమంలో భాగంగా అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి మల్‌రెడ్డిరంగారెడ్డి మొక్కలు నాటారు. దీంతో పాటు అనాజ్ పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీశ్రీశ్రీ ఏడు తలకాయల మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : చైర్మన్ మధుసూదన్ రెడ్డి




మేఘన డిగ్రీ, పీజీ కాలేజ్ ఫేర్వెల్ డే కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్మన్ మధుసూదన్ రెడ్డి తదితరులు

మలక్ పేట ,ఆగస్టు 4, ప్రభాతవార్త: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మేఘన డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ ఎం . మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్, చైతన్య పురి లోని మేఘన డిగ్రీ, పీజీ కళాశాల లో ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని చైర్మన్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని నూతన ఆవిష్కరణలను చేపట్టాలని పేర్కొన్నారు. తమ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం జాబ్ మేళాలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అత్యుత్తమ అధ్యాపక బృందంతో, ఆధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని తమ కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, అధ్యాపకులు మసరత్ సుల్తానా, ప్రజ్ఞ, కనకదుర్గ, స్నేహ, సౌమ్య, మెహనాస్ లతోపాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు పేదలకు రేషన్‌కార్డుల పంపిణీ : కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



రేషన్‌కార్డుల పంపిణీ, మంత్రి సహపంక్తి భోజన కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కెఆర్‌ఆర్: చిత్రంలో టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, కమీషనర్ సరస్వతి తదితరులు

సరూర్‌నగర్, ఆగస్టు 4 ప్రభాతవార్త: బాలాపూర్ మండలంలోని మల్లాపూర్‌లోనున్న వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతల మీదుగా పేదలకు రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. అదే విధంగా మంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్నబియ్యం సహపంక్తి భోజనం చేస్తారని ఆయన వెల్లడించారు. సోమవారం కెఎల్ ఆర్ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ సరస్వతి, టిపిసిసి కార్యదర్శి, స్థానిక కన్వెన్షన్ హాల్ అధినేత యెల్మేటి అమరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి రేషన్‌కార్డుల పంపిణీ, సహపంక్తి భోజన కార్యక్రమాలు జరగనున్న వైఆర్ కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు జారీ అయ్యాయనీ వాటిని మంగళవారం లబ్ధిదారులకు అందివ్వడం జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో కార్డుల పంపిణీ కార్యక్రమం, సన్నబియ్యం సహపంక్తి భోజన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచించారు. మంత్రి శ్రీధర్‌బాబు రేషన్‌కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన తర్వాత మిగిలిన కార్డులను ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తెచ్చి అందజేస్తారని ఆయన వెల్లడించారు. ఈ విషయంలో ఎవరూ ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను అందిస్తుందని కెఎల్‌ఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు అహ్మద్ బామ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించి సంఘటిత శక్తిని చాటాలి

### భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి సంజయ్ ఘనాటే



భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి సంజయ్ ఘనాటేతో బడంగ్‌పేట్ కార్పొరేషన్ గణేష్ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గం

సరూర్‌నగర్, ఆగస్టు 4 ప్రభాతవార్త: గణేష్ నవరాత్రి ఉత్సవాలు, లడ్డూ వేలాల్లో ప్రసిద్ధి చెందిన బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి సంజయ్ ఘనాటే పిలుపునిచ్చారు. సోమవారం జరిగిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ గణేష్ ఉత్సవ సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ఐక్యతకు ప్రతీక అనీ ఉత్సవాలను వైభవంగా జరిపి సంఘటిత శక్తిని చాటాలని సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీల వారు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన అన్నారు. అనంతరం సంజయ్ ఘనాటే సమక్షంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ గణేష్ ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**ఉత్సవ సమితి అధ్యక్షునిగా నడికుడ యాదగిరి**

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా నడికుడ యాదగిరి, ఉపాధ్యక్షులుగా పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, టేకుల భాస్కర్‌రెడ్డి, బొర్ర జగన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, పాలుబాయి లక్ష్మణ్, రామిడి శూరకర్ణారెడ్డి, కార్యదర్శులుగా గొల్ల లక్ష్మీనారాయణ, గడ్డం వెంకటేశ్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర రాజు గుప్త, మిర్జల విజేందర్ బిట్టు, వర్త్యావత్ తిరుపతి నాయక్, చేగూరి పరమేశ్, కాసోజు నయనాచారి, కోశాధికారిగా భీమిడి చంద్రపాల్‌రెడ్డిలు ఏకగ్రీవంగ ఎన్నికయ్యారు.

## భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న సురేఖభాస్కర్‌రెడ్డి, గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఆగస్టు 4 ప్రభాతవార్త: శ్రీమైసమ్మ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు ఉత్సవ కమిటీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, ప్రధానకార్యదర్శి బండి మధు ఆధ్వర్యంలో శ్రీరేణుకఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో బాగంగా అమ్మవార్లకు బోనాల సమర్పణ ఫలహారం ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయపురికాలనీ, టెలిఫోన్‌కాలనీ, వాసవికాలనీ, గ్రీన్‌హిల్స్ కాలనీల మీదుగా ఎన్టీఆర్‌నగర్ శ్రీఖిల్లమైసమ్మ అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపు ఉత్సవము ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిపిసిసి సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, ఆర్కేపురం మాజీ కార్పొరేటర్ జీహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ దేప సురేఖాభాస్కర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టడ్ కార్పొరేటర్ పున్న నిర్మల హాజరై పోచమ్మ, ఎల్లమ్మ ,మైసమ్మ అమ్మవార్లకు పూజాలు నిర్వహించి మైసమ్మ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు పున్న గణేష్ నేత మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు నిదర్శనంగా నిలిచే బోనాల పండుగను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారని తెలిపారు. ఫలహారం బండి అమ్మవారి ప్రతిరూపం తొట్టెల, పోతరాజుల నృత్యాలతో బాజా భజంత్రీలతో జోగిని అనురాధ నేతృత్వంలో శివశక్తుల పూనకాలతో సాగిన ఊరేగింపుగా వస్తున్న అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి హారతులతో ప్రజలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ నాయకులు గట్ల రవీంద్ర, శ్రీఖిలామైసమ్మ అమ్మవారి దేవాలయం చైర్మన్ సురేష్‌కుమార్, రఘుపతి రెడ్డి, జిన్నారం వెంకటేశ్వర్లు, నవరాజ్, జెల్లా జగన్నాథం, గుండా నరసయ్య, ఎల్లన్న, యాదవరెడ్డి, రాళ్లబండి హనుమంతరావు, ఏవిరావు, ఆనంద్, దుర్గాప్రసాద్, చంద్రమౌళి, పడాల రవీందర్‌నేత, హరీష్, దినేష్, చిలకరాజు సాయికుమార్, బండి రాహుల్, సందీప్, అనుదీప్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సేవలతో పేదలకు చేరువవుతున్న లయన్స్ క్లబ్‌లు



కుషాయిగూడ, ఆగస్టు 4,ప్రభాతవార్త. 320సి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం పేదలకు 06 లక్షల విలువైన ఐరన్బాక్స్లు, కుట్టు మిషన్లు పంపిణి ఆపదలో ఉన్న పేదలను గుర్తించి వారికి సేవలు అందిచడం నిజమైన లయనిజమని లయన్స్ క్లబ్ 320సి గవర్నర్ కొమ్మరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ 320సి డిస్ట్రిక్ట్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని అట్టహసంగా నిర్వహించారు.లయన్స్ క్లబ్ అఫ్ నెరెడ్మెట్ అధ్వర్యంలోనూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 320సి క్లబ్ నూతన గవర్నర్ గా కొమ్మరెడ్డి ఇన్నారెడ్డి, మోదటి వైస్ డిస్టిక్ గవర్నర్ కల్లెం క్రిష్ణరెడ్డి, రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మందా సురేష్కుమార్, క్యాబినేట్ కార్యదర్శిగా లయన్ జి రవికుమార్యాదవ్, క్యాబినేట్ కోషాధికారిగా లయన్ కిరస్కుమార్, క్యాబినేట్ కోఆర్డినేటర్ సంపత్కుమార్లు ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రాజు మన్నాని, ఘట్టమనేని బాబురావు, ఇన్నాలేషన్ అధికారిగా లయన్ హరినాథ్బాలు నూతన క్యాబినెట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా నిరుపేదలకు 06 లక్షల రూపాయల విలువైన ఐరన్ బాక్స్లు, కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ ప్రతినిదులతో కలసి వారు మొక్కలు నాటారు. ఈసందర్భంగా నూతన గవర్నర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ భాద్యతగా సామాజిక సేవ కార్యక్రమాలను ఆయన నవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు. సేవ కార్యక్రమాలలో 320 గవర్నర్ ఇన్నారెడ్డి అధ్వర్యంలో ముందుండాలని అతిదులు సూచించారు. ఈసంవత్సరంలో సేవ కార్యక్రమాలను మరింత విస్తుతంగా చేపడుతామని నూతన గవర్నర్ తెలిపారు. ఈకార్యక్రమంలో వివిద క్లబ్స్ కు చెందిన పీడిజిలు, జిల్లా గవర్నర్లు, పూర్వ జిల్లా గవర్నర్లు వెయ్యి మంది లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యలపై సమీక్ష సమావేశం



హయత్ నగర్ ఆగస్టు4,ప్రభాతవార్త : హయత్ నగర్ ప్రాంతంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను సమూలంగా పరిష్కరించేందుకు రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వివిధ విగ్రహాల సంఘాల ప్రతినిధులతో పాటు సంబంధిత శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు.సమావేశంలో ముఖ్యంగా రోడ్ల విస్తరణకు అడ్డుగా ఉన్న విగ్రహాల స్థానం మార్పుపై చర్చ జరిగింది. అందరి మనోభావాలను గౌరవిస్తూ, ట్రాఫిక్ సౌలభ్యం దృష్ట్యా విగ్రహాలను పక్కకు తరలించాలని కోరారు. అందుకు సంఘాల ప్రతినిధులు సానుకూలంగా స్పందిస్తూ తమ పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి గారు నేషనల్ హైవే సీఈ శ్రీ ధర్మారెడ్డి గారితో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా మాట్లాడి, భాగ్యలత, హయత్ నగర్, లక్ష్మారెడ్డి పాలెం పరిసర ప్రాంతాల్లో పాదచారుల రద్దీ అధికంగా ఉండటంతో ప్రమాదాలను నివారించే దృష్ట్యా తగినచోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు (ఎఫ్‌ఓబీ) నిర్మించాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎండీఓ శ్రీవాణి గారు, సీఐ నాగరాజు గారు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గారు, నేషనల్ హైవే అధికారులతో పాటు, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గజ్జి భాస్కర్ యాదవ్, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, చెన్నగోని రవి, అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో ఘనంగా రంగం, భవిష్యవాణి



బోడుప్పల్లో రంగం కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ,పోగుల నర్సింహారెడ్డి తదితరులు

బోడుప్పల్, ఆగస్టు 4 ప్రభాతవార్త; బోడుప్పల్ ప్రజలను కంటికిరెప్పల కాపాడుకునే బాధ్యత నాదేనని,ప్రతి ఏటా నాకు మొక్కులు చెల్లించి నన్ను వైభవంగా చూస్తున్నారని పిల్లపాపలను కాపాడుకునేందుకు ఎల్లవేళలా అండగా ఉంటానని బంగారు మైసమ్మ దేవాలయం వద్ద సోమవారం నిర్వహించిన రంగం కార్యక్రమంలో భవిష్యవాణి చెప్పాడు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,ఆలయ కమిటీ అధ్యక్షుడు బొబ్బల లక్ష్మారెడ్డి,నాయకులు ,బొమ్మకు రమేష్,మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ , దానక్క అనిత యాదగిరి ఆలయ కమిటి ప్రతినిధులు పోగుల వీరారెడ్డి ,తోటకూర రవీందర్ యాదవ్,కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తే చర్యలు

ఎల్.బి.నగర్, ఆగస్టు 4 ప్రభాతవార్త: ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ రామాలయంలో నూతన దేవాలయం పునర్నిర్మాణ పనులు చేపడుతుండగా ప్రైవేటు వ్యక్తి దేవాలయం దారి కావాలని లేనిపక్షంలో డబ్బులు ఇవ్వాలని దేవాలయం సబ్యులను ఇబ్బంది పెడుతుండగా దేవాలయం కమిటీ సబ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే అధికారులతో కలిసి సోమవారం ఆ ప్రాంతాన్ని పర్యటించారు. అధికారులు ప్రైవేటు వ్యక్తి పత్రాలు పరిశీలించగా అవి నకిలీ అని తేల్చారు. అదేవిధంగా పక్కన ఉన్న రజక, కుమ్మర్ల స్మశానవాటిక వద్ద వంద గజాల స్థలం ఈ వ్యక్తులు కబ్జా చేశారని ఆరోపించారు. అందులో నిర్మాణం చేపట్టగా దాన్ని మున్సిపల్ సిబ్బంది కూల్చి వేశారు. ఇప్పుడు అదే స్థలంలో నూతన నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఆ స్థలం కాపాడాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. వెంటనే ఆ స్థలంలో ప్రహరీగోడ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ విజయ లక్ష్మి, నాయకులు అనంతుల రాజారెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, తూర్పాటి చిరంజీవి, జగదీశ్వర్, శంకరయ్య, యాదయ్య, సుదర్శన్, రాములుగౌడ్, రాజుగౌడ్, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కరణ్‌బాగ్‌లోని సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త: కరణ్‌బాగ్ కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణలు సోమవారం కరణ్‌బాగ్‌లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో డిసి అలీ, ఎఇ వెంకన్న, వాటర్‌వర్క్స్ డిజిఎం హస్మత్ అలీ, కాలనీ అధ్యక్షుడు శ్రీకరణశ్రీనివాస్, కార్యదర్శి సుదర్శన్, కాలనీవాసులు సాయి, త్రిమూర్తి, యుగంధర్, రవి, చారి పాల్గొన్నారు.

## లక్ష్మినారాయణ కాలనీలో సిసి రోడ్డు ప్రారంభం



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ లక్ష్మినారాయణ కాలనీలో రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కాలనీ సంక్షేమ సంఘాలు తమ ప్రాంతంలోని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి వాటి సత్వర పరిష్కారానికి తోడ్పాటునందించాలని సూచించారు. కాలనీలో త్వరలోనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దేవాసి భాయ్, లలిత్ భాయ్, కాంతి భాయ్, దయాని ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ గౌడ్, రాజేశ్వరి, వసంత, వాసు, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన శంకర్‌రెడ్డి



కిషన్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 4 ప్రభాతవార్త: కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిని మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి కలిసారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీలకు సంబంధించిన పలు ప్రజా సమస్యలను మంత్రికి వివరించి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. భారీ వర్షాల వల్ల పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయనీ చాలా చోట్ల డ్రైనేజీలు, రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆయన మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు కావడం లేదని ఆయన తెలిపారు. కాగా శంకర్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో జిల్లెలగూడకు చెందిన సీనియర్ నాయకుడు బచ్చనమోని నర్సింహా యాదవ్ తదితరులు ఉన్నారు.

## ప్రకృతి సంపాదన పెంపొందించుకోవాలి




ప్రదర్శనలో పాల్గొన్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, విజయ రంగ

ఎల్.బి.నగర్, ఆగస్టు 4 ప్రభాతవార్త: ప్రకృతి సంపదను పెంపొందించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, లైన్స్‌క్లబ్ హెల్త్ క్యాంప్ చైర్మన్, స్వచ్ఛభారత్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ డాక్టర్ బి.విజయరంగా పేర్కొన్నారు. లైన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట శాఖ, ఎస్ఎస్ బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వృక్షారోపణ, ఫ్లేగ్రౌండ్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి ప్లకార్డులు పట్టుకొని స్వచ్ఛ భారత్, హరిత హైదరాబాద్, పరిసరాల పరిశుభ్రతపై స్లైడ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్, పర్యావరణ కాలుష్య నియంత్రణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల పేర్లతో మొక్కల నిర్వహణను చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల చైతన్యం, సామాజిక బాధ్యతలలో భాగంగా ఒక గొప్ప ప్రేరణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కృష్ణమోహన్‌రెడ్డి, స్కూల్ డైరెక్టర్స్ చంద్రశేఖర్, నాగవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాధ, జితేంద్రదేవి, దగ్గుపాటి యెల్మండ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సేవాదళ్ ఆధ్వర్యంలో ఢిల్లీకి తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

సైదాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త: బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు చర్లపల్లి నుండి ప్రత్యేక రైలులో భారీ ఎత్తున ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ దేశంలో అధిక శాతం ఉన్న బిసిలకు సరైన న్యాయం జరగడం లేదన్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాలు తగిన విధంగా దక్కడం లేదన్నారు. గతంలో బిసిల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చేసిన కృషి ఆదర్శంగా నిలిచిందని, ఇప్పుడు మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కేంద్రాన్ని ఒప్పించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు జితేందర్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా బిసిలకు దామాషా ప్రకారం న్యాయం జరగాలని కోరిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు రాజకీయ ప్రయోజనం కోసం కాదని, సమాజ అభివృద్ధి కోసం అవసరమని అన్నారు. కార్యక్ర మంలో సేవాదళ్ ప్రతినిధులు వాజిద్, బండి సురేందర్, సంపత్ కుమార్ గౌడ్, అబుబాకర్, ఫసీఉద్దీన్ పాల్గొన్నారు.